ప్రజాశక్తి
ఆదివారం 19 అక్టోబర్ 2025
5
కర్నూలు

ఒరిగిందేమీ లేదు..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలులో ప్రధానమంత్రి మోడీ పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు. జిల్లాకు మోడీ ఎలాంటి వరాలూ ఇవ్వలేదు. గురువారం కర్నూలు నగర శివారులలోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద రాగ మయూరి హిల్స్ సమీపంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ సభ నిర్వహించారు. శ్రీశైలం పర్యటన ముగించుకొని నేరుగా ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నన్నూరు వద్ద హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. బహిరంగ సభకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఓపెన్ టాప్ వాహనంలో ముగ్గురూ ప్రజలకు అభివాదం చేస్తూ వేదికకు చేరుకున్నారు. బహిరంగ సభ వేదిక పైనుండే ప్రధాని మోడీ రాష్ట్రంలో చేపట్టిన రూ.13,429 కోట్ల కేంద్ర ప్రాజెక్టులను పైలాన్ ద్వారా ఆవిష్కరణ చేశారు. విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, పారిశ్రామిక, రక్షణ రంగాలకు చెందిన రూ. 13,429 కోట్ల విలువైన అభివద్ధి పనులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టులను మోడీ ప్రారంభించారు. మొత్తంగా ప్రధాని ప్రసంగంలో శంకుస్థాపన చేసిన, ప్రారంభించిన ప్రాజెక్టుల గురించి వివరించడానికి తప్ప రాష్ట్రానికి ఒక్క రుపాయి కూడా నిధులు ఇవ్వలేదు. ప్రజల ప్రధాన సమస్యలను నరేంద్రమోడీ ప్రస్తావించలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల గురించి. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల గురించి ప్రధానే కాదు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు కూడా ప్రస్తావించిలేదు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధరలు, ప్రధానంగా ఉల్లి, టమోట రైతుల గురించి ఎవ్వరూ ప్రస్తావించలేదు. కోట్లు ఖర్చు చేసి మోడీని పొగడటానికి, మోడీ సిఎంను, డిప్యూటీ సిఎంను, లోకేష్‌ను పొగడానికేనా అని సభకు వచ్చిన ప్రజలు చర్చించుకున్నారు. మోడీ సభకు ఆర్‌టిసి బస్సులు కేటాయించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సభా వేదిక వద్ద సరయిన సౌకర్యాలు, మరుగుదొడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పార్కింగు ప్రదేశం దూరంగా ఉండటంతో మహిళలు, కొందరు వృద్ధులు బస్సుల వద్దనే నిలిచిపోయారు.

మోడీ గో బ్యాక్ : జిల్లాలో ప్రధాని పర్యటన నేపథ్యంలో 'మోడీ గో బ్యాక్' అంటూ వామపక్ష నాయకులు నినదించారు. జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. జిల్లా పరిషత్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన రాజ్‌విహార్, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ వరకూ సాగింది. వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలు, నల్ల చొక్కాలు, నల్ల రిబ్బన్ల, ఫ్లకార్డులతో ప్రదర్శనలో పాల్గొన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ గో బ్యాక్, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి, ప్రత్యేక హోదా అమలు చేయాలి, కడప ఉక్కు నిర్మాణం చేపట్టి యువతకు ఉపాధి కల్పించాలంటూ నినాదాలు చేశారు. విభజన హామీలు అమలు చేయని మోడీ కర్నూలు పర్యటన దేనికోసమని వామపక్ష పార్టీల నాయకులు ప్రశ్నించారు.

అందని రాయితీ విత్తనాలు : రబీ సీజన్ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా రాయితీ పప్పు శనగ విత్తనాల కోసం రైతులు అవస్థలు తప్పడం లేదు. ఈ ఏడాది ఆగస్ట్, సెప్టెంబర్ మాసాలలో అధిక వర్షాలు కురవడంతో రబీలో పప్పుశనగను సాగు చేయడానికి రైతులు పంట పొలాలను సిద్ధం చేశారు. అక్టోబర్ మొదటి వారం నుండి రైతులు పప్పు శనగ పంటను సాగు చేస్తున్నారు. ఉల్లి పంట సాగు చేసిన రైతులకు ఉల్లి ధర లేకపోవడంతో పంటను తొలగించి పప్పు శనగ పంట సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాల కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. భూమిలో పదును ఆరిపోతుందన్న భయంతో బహిరంగ మార్కెట్లో పప్పు శనగ విత్తనాల కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పప్పు శనగ విత్తనాలు క్వింటా రూ.5850 ఉండగా, బహిరంగ మార్కెట్లో రూ.6000 ధర ఉండడంతో వ్యాపారస్తుల దగ్గర కొనుగోలు చేసి పంట సాగు చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు.

ఆడపిల్లలను చదివించాలి

అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో కలెక్టర్ ఎ.సిరి

మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి తల్లిదండ్రులను కోరారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జిల్లా మహిళా అభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 56 శాతమే ఉందన్నారు.. అక్షరాస్యత రేటు 100 శాతం తీసుకొని వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆడపిల్ల పుట్టిన మగపిల్లాడు పుట్టినా ఇద్దరు సమానమేనని ఆడపిల్ల ఎప్పుడు భారం అనుకోకూడదని పేర్కొన్నారు. ఆడపిల్లలను బాగా చదివించడంతో పాటు పౌష్టికాహారం బాగా పెట్టాలని తెలిపారు. ఇళ్లల్లో కూడా ఆడపిల్ల, మగ పిల్లవాడు అనే వివక్ష ఎప్పుడు చూపించకూడదన్నారు. చదువుకునే ఆడపిల్ల కుటుంబంలో ఉండడం వల్ల కుటుంబం , సమాజం బాగుపడుతుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ విద్యార్థులు అందరూ బాగా చదువుకొని జీవితంలో రాణించాలన్నారు. విద్యార్థి దశలో ఎక్కువ సమయం చదువు మీద కేటాయించాలన్నారు. సమయాన్ని ఎప్పుడు కూడావృధా చేయకూడదన్నారు. గడిచిన సమయం మరల తిరిగి రాదన్నారు. రక్షణ కొరకు స్త్రీ శక్తి అనే యాప్ కూడా తెచ్చామన్నారు. కార్యక్రమం అనంతరం నాటకం, డాన్స్ వేసిన చిన్నారులకు కలెక్టర్ పాణ్యం ఎమ్మెల్యే బహుమానాలు అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి విజయ, డిఎంహెచ్ఓ డాక్టర్ శాంతి కళ, సిపిఒ భారతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదాబేగం, సెక్సువల్ హరాస్మెంట్ కమిటీ చైర్ పర్సన్ మాధవి శ్యామల, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గుండ్రేవుల సాధనకు ఐక్యంగా ఉద్యమం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో సాగు,తాగునీటి సమస్య పరిష్కారానికి గుండ్రేవుల ప్రాజెక్టు దిక్సూచి లాంటిదని పలు రాజకీయ ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శనివారం కర్నూల్ నగరంలోని స్థానిక బిర్లా కాంపౌండ్ లో కర్నూల్ ప్రగతి సమితి కార్యాలయంలో గుండ్రేల్ల ప్రాజెక్టు సాధనకై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు ఎం శ్రీహర్ష అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రముఖ విద్యావేత్త జి పుల్లయ్య ప్రముఖ ఆర్థిక శాస్త్ర నిపుణులు డాక్టర్ మన్సూర్ రెహమాన్ పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఈ పుల్లారెడ్డి రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె చెన్నయ్య పంచాయతీరాజ్ చాంబర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి రైతు సంఘం నాయకులు రామకష్ణారెడ్డి ప్రజా పరిరక్షణ సమితి నాయకులు డేవిడ్ బిజెపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి బీఎస్పీ జిల్లా నాయకులు అరుణ్ కుమార్ సీనియర్ జర్నలిస్ట్ హరినాథ్ రెడ్డి రాయలసీమ విద్యార్థి జెఎసి నాయకులు రవికుమార్ , విహెచ్‌వి విహెచ్పి నాయకులు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు డిపిఆర్ సిద్ధం చేసి ముఖ్యమంత్రులతో చర్చించిన రిటైర్డ్ సీనియర్ ఇంజనీరింగ్ అధికారి సుబ్బారాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.. ఈ సందర్భంగా జి పుల్లయ్య మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అందులో ప్రధానంగా గుండ్రేవుల ప్రాజెక్టును వెంటనే చెప్పటాలని కోరారు. ఈ ప్రాజెక్టు సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ ప్రాజెక్టు రూ 5500 కోట్లకు చేరుకుందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి ఈ ప్రాజెక్టును అమల్లోకి తీసుకురావాలన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల కర్నూలు జిల్లా సస్యశ్యామలంగా మారుతుందని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ పుల్లారెడ్డి మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టి జిల్లాలో సాగు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఎం. శ్రీహర్ష మాట్లాడుతూ. జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన గుండ్రేవులను సాధించేంతవరకు పోరాడుతామని, ప్రతి ఒక్కరూ మాకు తోడుగా రావాలని కోరారు. గుండ్రేవుల ప్రాజెక్టు ద్వారా కర్నూలు నగర ప్రజలకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం లభిస్తుందని, జిల్లాలోని రైతులకు పుష్కలంగా సాగునీరు అందుతుందని, తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం లభిస్తుందన్నారు. వచ్చేనెల మూడో వారంలో ప్రాజెక్టు సాధనకు గాను జల దీక్ష చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని కోరారు

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న గుండ్రేవుల సాధన సమితి, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు

ఇంజనీర్ల నిర్లక్ష్యంతో రూ.కోట్లు వృథా

- ఇంజనీర్లు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పోరేషన్

కర్నూలు శివారు కాలనీలో అంతంత మాత్రంగా ఉన్న రోడ్లను తవ్వి మరమ్మతులు చేయకుండా రోజుల తరబడి అలాగే వదిలేయడం వల్ల రాత్రి సమయాల్లో, వర్షం వచ్చినప్పుడు గుంతలు కనిపించక ప్రతిరోజు అనేకమంది మహిళలు, వద్ధులు,ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారని, రహమత్ నగర్ అసోసియేషన్ ప్రతినిధి సి.మల్లికార్జున, సంతోష్ నగర్ కాలనీ ప్రతినిధి కె.అబ్దుల్ రజాక్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎండి యునూస్ తెలిపారు. శనివారం సంతోష్ నగర్ నుండి రహమత్ నగర్ వెళ్లే రోడ్లపై పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు శివారు కాలనీలపై మారుతల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. లక్షలతో పూర్తయ్యే రోడ్ల మరమ్మత్తులు నగరపాలక సంస్థ ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కోట్ల రూపాయల విలువైన ప్రజల ఆరోగ్యం,మినీ వాహనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ వెంటనే స్పందించి రోడ్లు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్, సంబంధిత ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే మరమ్మత్తులు పూర్తి చేయించాలని కమిషనర్‌ను కోరారు. ఈ పర్యటనలో ఎస్.అన్వర్ భాష, ఏ. ఆంజనేయులు గౌడ్, ఎస్.అబ్దుల్లా, కె నూర్ బై, ఎస్ఎ రెహిమాన్, ఎస్ భాష, ఎల్ నయుం పాల్గొన్నారు.

రోడ్డు తవ్వి వదిలేసిన దృశ్యాన్ని చూపుతున్న నాయకులు

వాయు కాలుష్య నిర్మూలన అవసరం

- సైకిల్ వాడకం కీలకం
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వాయు కాలుష్య నిర్మూలనలో సైకిల్ వాడకం కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుండి రాజ్ విహార్ వరకు 'క్లీన్ ఎయిర్' అంశంపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అలాగే నగరపాలక కార్యాలయంలో సైకిల్ వాడడం వలన కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకత, స్వచ్ఛమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర వంటి అంశాలపై వివరించారు. అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలతో కలిసి కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాయు కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఢిల్లీ లాంటి మహా నగరాల్లో కాలుష్య నివారణకు చేపట్టిన చర్యలు ప్రజలందరూ గమనించాలన్నారు. వ్యక్తిగతంగా సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకుంటే వాహనాల వలన ఉత్పత్తి అయ్యే కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, ఇది కేవలం పర్యావరణానికి మాత్రమే కాదు, వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా ఎంతో మేలును చేస్తుందని తెలిపారు. ప్రతి పౌరుడు సైకిల్ వాడకానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమాజాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా మార్చడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ యన్.చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, డిసిపి వెంకటరమణ, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, సిఎంఎం భాస్కర్ రెడ్డి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్

చెస్ టోర్నమెంట్ విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి ఫరూక్

ఘనంగా రాజవర్ధన్ రెడ్డి జయంతి

-పలుచోట్ల సేవా కార్యక్రమాలు,
-అంతర్జాతీయ చెస్ పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మాజీ ఎంపిపి డి.రాజవర్ధన్ రెడ్డి 47వ జయంతి వేడుకలను జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కెడిసిసిబి ఛైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి నివాసంలో రాజవర్ధన్‌రెడ్డిని స్మరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో బెడ్ షీట్లు , స్ట్రెచర్, వీల్ ఛైర్ హాస్పిటల్ సూపరిడెంట్ వెంకటేశ్వర్లుతో కలిసి అందజేశారు. సిల్వర్ జూబ్లి కాలేజీలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కెవి సుబ్బారెడ్డి కాలేజీలో మంత్రి ఫరూక్, కెడిసిసిబి ఛైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కెవి.సుబ్బారెడ్డి, ఎంపీ బస్తీపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్‌తో కలిసి జాతీయ చెస్ ఛాంపియన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. అభయగిరిలో కేక్‌కట్ చేసి ,వృద్ధులు, అనాథలకు భోజనాలు వడ్డించారు. డి.రాజవర్ధన్ రెడ్డి అభిమానులు , విష్ణుసేన అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్లపై మురుగునీరు

- అనారోగ్యాలతో ప్రజలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

స్థానిక బుధవారం పేట 15వ వార్డు లోని సిపిఎం పార్టీ నాయకుల బృందం వార్డులోని ప్రజాసమస్యలను ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ, సిపిఎం నగర కమిటీ సభ్యులు ఆర్.కృష్ణ మాట్లాడుతూ బుధవార పేటలో కరుణయ్య అంగడి దగ్గర కాలువలు కాలువలో నుండి రోడ్డుపైకి నీళ్లు వస్తున్నాయని, అలాగే తోటలోని అంగన్వాడి కేంద్రం దగ్గర కాలువలు శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు నిండిపోయి మురుగునీరు నుంచి దుర్వాసన పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి అని తెలిపారు. త్వరగా మున్సిపల్ అధికారులు బుధవారపేటలోని కాలువలు, కరెంటు, కల్వర్టుల సమస్య బోరింగ్ రిపేర్ చేసే ప్రజల ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను పెద్ద ఎత్తున సమైకరించి మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధాకర్, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు ఆర్. ఆంజనేయులు, బి. మద్దిలేటి, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల సాధన ఆత్మవిశ్వాసం పెంచుతుంది

- తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానంలో మంత్రి టిజి భరత్
- రాష్ట్ర స్థాయికి ఎంపికయిన క్రీడాకారులకు మంత్రి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తైక్వాండో, కరాటే లాంటి క్రీడల సాధన చేయడం వలన అదనంగా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పరిశ్రమల శాఖ మంత్రి టి.భరత్ అన్నారు. తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు శనివారం కలర్ బెల్టుల ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతిరోజు క్రీడాసాధన చేయడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. క్రీడల సాధన వలన మరో అవకాశం విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఉంటుందని తెలిపారు. అందుకే తల్లిదండ్రులు పిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్నా, చదువులో మంచి మార్కులు సాధించాలన్నా క్రీడాసాధన చేయించాలన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో పిల్లలు బాగా చదివితే కొత్తగా కర్నూలులో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక వాడతో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రత్యేకించి కోచ్ షబ్బీర్‌తో గత 15 సంవత్సరాల నుంచి అనుబంధం ఉందన్నారు. నాకుమారునికి తైక్వాండో శిక్షణ ఇప్పించాలని కర్నూలులో బెస్ట్‌కోచ్ ఎవరని సర్వే చేసినప్పుడు షబ్బీర్‌హుస్సేన్ పేరు సూచించారన్నారు. ఆయన భవిష్యత్తులో మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి కర్నూలుకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. పద్మలతారెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, నారాయణ స్కూల్ ప్రిన్సిల్ శ్రీనివాస్‌రెడ్డి, కార్డియాలజిస్టు ఇందుప్రకాశ్, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కృష్ణ, తదదితరులు పాల్గొన్నారు. 40 మంది తైక్వాండో క్రీడాకారులకు కలర్ బెల్టుల ప్రదానం చేశారు. స్కూల్ గేమ్స్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయిన క్రీడాకారులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన తైక్వాండో క్రీడాకారులను, బెల్టులు పొందిన వారిని అభినందిస్తున్న మంత్రి టిజి భరత్

కోటి సంతకాల సేకరణ అడ్డుకోవడం తగదు

- వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి సంతకాల కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి క్రిష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి వెళ్ళుతుండగా టిడిపి నాయకులు అడ్డుకోవడం సమంజసం కాదని వైసి పి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఎస్‌వి కాంప్లెక్స్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ చేపట్టిన కార్యక్రమాలను అడ్డుకోవడం రాజకీయాలను ప్రేరేపించడం మంచి పద్ధతి కాదన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే ఈవిషయం తెలుసుకోవాలన్నారు. రాష్ట్రం అంతటా ఈ కార్యక్రమం ప్రతి గ్రామంలోనూ జరుగుతుందని, ఇలాంటి చర్యలకు ఎవరు భయపడరని తెలిపారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ గతంలో నా భర్తను చంపినట్లే అధికార పార్టీ నాయకులు నన్ను కూడా అంతం చేసేందుకు కుట్ర చేస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయన్నారు. ఒక మహిళ అని చూడకుండా కారు మీద దాడి చేసి మా మరిది, ఎంపిపికారు అద్దాలు పగల గొట్టి అసభ్యకరంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాభిమానం ఉన్న వైసిపి అధికారంలోకి తిరిగి రావడం కాయమన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు సహకారంతో చిట్యాల గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నగర మేయర్ బివై రామయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఏ పార్టీ వారైనా గ్రామలలో ప్రచారం చేసుకోవచ్చన్నారు. గతంలో కూడా చెరుకులపాడు గ్రామంలో మా కారు అద్దాలు ధ్వంసం చేశారని, మళ్ళీ ఇప్పుడు కారు అద్దాలు పగలగొట్టి గొడవలు సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. క్రిష్ణగిరి మండలంలో మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో చిచ్చుపెట్టేలా చేస్తున్నారని తెలిపారు. అనంతరం కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ని కలిసి గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని, గొడవలు సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ సుభాష్ చంద్రబోస్, క్రిష్ణగిరి ఎంపిపి డాక్టర్ వెంకటరామిరెడ్డి, వైసిపి జిల్లా నాయకులు పగిడిరాయ్ జగన్నాథ రెడ్డి, కడమకుంట్ల అమర్నాథ్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, పోతుగల్లు వెంకటేష్, ఆగవేలి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుత్ను ఎస్‌వి మోహన్ రెడ్డి

ఎసిబికి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

- బాధితుడు ఎంపిటిసి రాజు ఫిర్యాదు మేరకు దాడి

ప్రజాశక్తి- పత్తికొండ : తుగ్గలి మండలం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నరేష్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తుగ్గలి గ్రామానికి చెందిన ఎంపిటిసి రాజు గత సంవత్సరం ఎస్‌సి కాలనీలో గ్రావెల్ రోడ్డు వేశారు. ఏడాదైనా ఎంబుక్ రికార్డ్ చేయకుండా ఇబ్బందులు పెడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నరేష్ వర్క్ చేసిన దానిపై 10శాతం లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎసిబి అధికారులకు ఎంపిటిసి రాజు ఫిర్యాదు చేశారు. శనివారం పత్తికొండ సబ్ డివిజన్ పంచాయతీరాజ్ కార్యాలయంలో ఎంపిటిసి రాజు ఆర్డబ్ల్యుఎస్ ఎఇ నరేష్ కు రూ.13,000 లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నరేష్ ను సమగ్ర విచారణ చేపట్టి అతనిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఎసిబి అధికారులకు పట్టుబడిన ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి సమగ్రంగా తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లుపెద్దిరాజు, బెస్తకార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్ హామీ ఇచ్చారని ఉమ్మడి కర్నూలు జిల్లా డిఎఫ్‌సిఎస్ ఛైర్మన్ బిఎస్. నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం వారు కర్నూలు జిల్లా మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. పెద్దిరాజు మత్స్యశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న పలు సమస్యలను స్థానిక అధికారులతో తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని ఫిష్ ఫారమ్‌ను పరిశీలించారు. చేపల పెంపకంపై సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎఫ్‌డిఒకు శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ఛైర్మన్ కొల్లుపెద్దిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. బొమ్మన శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెస్త సమాజ అభివృద్ధి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామని అన్నారు. డిఎఫ్‌సిఎస్ ఛైర్మన్ బిఎస్.నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు , బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్ ఒకే సమయంలో కర్నూలు వచ్చి మత్స్యశాఖ కార్యాలయం పరిశీలించి అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా సమకూరుస్తామని హామీ ఇవ్వడం మత్స్యకారులకు ఎంతో ఆనందదాయకమని అన్నారు. మత్స్యకారుల సమస్యలను సమగ్రంగా సేకరించి ఒక రిప్రజెంటేషన్ రూపంలో ప్రభుత్వానికి నివేదించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ టిజి. రమేష్ ,చిరంజీవి, ఎద్దుల వెంకటేష్, అడ్వకేట్ శ్రీనివాసులు, పలువురు మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

ఎం.హరికిషన్‌కు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు జిల్లాకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం.హరి కిషన్ రచించిన చందమామ చెప్పిన కథలు పుస్తకం అత్యంత ప్రతిష్టాత్మకమైన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారానికి ఎన్నికైనట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సిలర్ నిత్యానందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న హైదరాబాదులోని ఎన్‌టిఆర్ కళామందిరంలో సాహితీ ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేసి, రూ.20,116 నగదుతో ఘనంగా సత్కరిస్తామని ప్రకటించారు. డాక్టర్ ఎం హరికిషన్ సంయుక్త అక్షరాలు లేకుండా, విద్యార్థుల్లో ఉత్తమ విలువలు పెంపొందించేలా అత్యంత సులభమైన శైలిలో రచించిన ఈ పుస్తకంలోని 25 కథలు పిల్లల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయని అన్నారు. నవసమాజ నిర్మాణంలో భాగమవుతాయని అందుకే ఈ పురస్కారాన్ని హరికిషన్‌కు అందజేస్తున్నట్లు న్యాయనిర్ణేతలు ప్రకటించారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం

- పైపుల డ్యామేజీతో కలుషితమవుతున్న తాగునీరు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నందవరం

ప్రజల ఆరోగ్యలపైన నందవరం గ్రామానికి చెందిన అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.గ్రామంలో ఎటుచేసిన పైపులు లీకై త్రాగునీరు కలుషితం చెందుతున్నాయి. అధికారులకు సమస్యలు తెలిపిన పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు తెలిపారు. సుమారు ముడు నెలలుగా వీరభద్ర దేవాలయం దగ్గర పైపు లీకై నీరు వృధాగా వెళుతున్నాయి. అధికారులకు తెలిపిన స్పందించట్లేదని ప్రజల అంటున్నారు. అదేవిధంగా కొన్ని రోజుల క్రితం 5వ వార్డు కోట వీధిలో గల ట్యాంకు వెళ్లే పైపు లీక్ అయింది. ఆ పైపు లీకైన ప్రదేశంలో సెప్టిక్ ట్యాంక్ ఉన్నట్లు ప్రజలు తెలిపారు. లీకైన పైపు ద్వారా సెప్టిక్ ట్యాంక్‌లో ఉన్న గలీజ్ ట్యాంకులోకి వెళుతున్నట్లు ప్రజలు ఆరోపణ చేస్తున్నారు. ట్యాంకు ద్వారా వచ్చే కలుషితమైన నీటిని వీధి ప్రజలు తాగుతున్నారని పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి తెలిపిన తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు చెప్పారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న అధికారులపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పలుమార్లు సమస్యలు తెలిపిన ఇంత నిర్లక్ష్యం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నందవరం గ్రామం నుండి మాచపురంకు వెళ్లే ప్రధాన రహదారి లోపల వాలు ఉంది.అక్కడ గుంత ఏర్పడి నీరు కలుషితం చెందుతున్నాయి. సంవత్సరాలగా ఉన్న ఈ సమస్యను అధికారులు పరిష్కరించలేదు. అదే విధంగా బీరప్ప దేవాలయం దగ్గర పైపు సుమారుగా మూడు చోట్ల డ్యామేజై నీరు వృధాగా వెళుతున్నాయి. 7 వార్డులో ప్రధాన రహదారి పైన పైపు లీకై నీరు వెళుతున్నాయి.నీరు కలిసితం చెంది ప్రజల అనారోగ్యం పాలవుతున్న,విచ్చలవిడిగా నీరు వీధులలో లీకై పారుతున్న అధికారులు, పాలకులు చోద్యం చూస్తున్నారు.

తాగునీటితో చెత్త, పాచి వస్తోంది

- చాకలి రామదాసు, కోటవీధి

తాగునీటిలో పాచి, గలీజు వస్తుంది. కొత్త ట్యాంకు ప్రారంభమై సుమారుగా ఆరు నెలలు కావస్తుంది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ట్యాంకును శుభ్రపరిచిన దాఖలాలు లేవు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. అదేవిధంగా త్రాగునీరు గలీజ్, దుర్వాసనతో వస్తున్నాయి.

- డ్యామేజీతో అయిన పైపులైను

కనీస మద్దతు ధర అమలుకు చర్యలు తీసుకోవాలి

- మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శికి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-ఆదోని రూరల్

పత్తి, వేరుశనగ పంటలంను ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో సిసిఐ, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి కనీస మద్దతు ధర అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతు ఎపి సంఘం జిల్లా అధ్యక్షులు కె. వెంకటేశులు, ఉపాధ్యక్షులు కె.మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈనెల 21వ తేదీ నుండి పత్తి పంటను సిసిఐ కొనుగోలు చేస్తుందని మార్కెటింగ్ జెడి రామాంజనేయులు పత్రికా ప్రకటనలో తెలియజేసినప్పటికీ రైతు భరోసా కేంద్రాల్లో నేటి వరకు రైతుల పేర్లు నమోదు చేసుకోవడం లేదని, దీనివల్ల సీసీ ద్వారా పత్తి కొనుగోలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని రైతులు సహాయ కార్యదర్శి దృష్టికి తెచ్చారు. ఇప్పటికే మార్కెట్ యార్డ్ లో కానీ పరిశ్రమలలో కానీ 4000 నుండి 7000 రూపాయలు లోపు ధర పలుకుతోందని, అంతేకాదు రోజురోజుకీ ధరలు పతనమవుతున్నాయని తెలిపారు. ఒకపక్క అధికవర్షాల వల్ల పత్తి వేరుశనగ ఆముదం పంటలు దిగుబడి పూర్తిగా తగ్గిపోవడం మరొకపక్క కనీసం మద్దతు ధరలు అమలు కాలేకపోవడం వల్ల పెట్టిన పెట్టుబడి రాక రైతుల అప్పుల పాలవుతున్నారన్నారు. తక్షణమే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పత్తి పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఈరన్న, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

ఆదోని మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శికి వినతి ఇస్తున్న నాయకులు

సిఎం సహాయనిధి పేదలకు ఒక వరం : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరమని ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో తాలూకా పరిధిలోని నందవరం మండలం పలు గ్రామాల బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డిఅందజేశారు. మొత్తం 16 మందికి గాను రూ.8,53,968 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 122 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోటి 12 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలు అందుకున్నారుని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మాధవరావు దేశాయ్, టిడిపి మండల అధ్యక్షులు కాసింవలి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న రాముడు, సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్, రాయచోటి రామకష్ణారెడ్డి, గురుజాల శివారెడ్డి, చంద్ర, మైనార్టీ నాయకులు గిర్ని ఈషా, మల్లప్ప గౌడ్, నల్లంగి మల్లికార్జున, డ్డీ మురళి తదితరులు పాల్గొన్నారు

సిఎం సహాయనిధి చెక్కున అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి- హాలహర్వి

మండల కేంద్రమైన హాలహర్విలో దాదాపు 5000 మంది నివసిస్తున్నారని, వీరికి సరిపడే నీరు అందక నీటికోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గ్రామ సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. కృష్ణ మాట్లాడుతూ మండలకేంద్రంలో ఒక ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని, అలాగే స్మశాన వాటిక లేదు భూసేకరణ చేసి స్మశాన వాటిక నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, బాలరాజు, నాగరాజ్, నూర్‌బాష పాల్గొన్నారు

అరికెరలో మంచినీటి సమస్య పరిష్కరించాలి

సచివాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండలం అరికెర గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయం ముందు ధర్నా చేశారు. మొదట సిపిఎం పోరుబాటలో భాగంగా శనివారం అరకెర గ్రామంలో ప్రజలతో కలిసి గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో 10 రోజులైనా మంచినీళ్లు రాకపోతే ఎలా అని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో చేతిపంపులు చెడిపోయి సంవత్సరాలు గడిచినా వాటిని బాగు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. గ్రామంలో పనులు లేక ఇప్పటికీ సుదూర ప్రాంతాలకు వలసలు ప్రారంభమయ్యాయన్నారు. ఉపాధి పనులను చేపట్టాలని, పెండింగులో ఉన్న ఇళ్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని, వీధిలైట్లు పోయిన చోట లైట్లు వేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేకపోతే గ్రామంలో ప్రజలను సమీకరించి సచివాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం అరికెర డిజిటల్ అసిస్టెంట్ సుమవర్ధిని కి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు విఠల్, ఈరన్న, పరమేష్, వీరేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అరికెర డిజిట్ అసిస్టెంట్ సువర్ధినికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

మాజీ ఎమ్మెల్యే పై దాడి సిగ్గుచేటు

ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై పై దాడులకు పాల్పడటం సిగ్గుచేటని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి అన్నారు. శనివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి మహిళా పై దాడికి దిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని అన్నారు. శుక్రవారం ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రవేటికరణకు తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ లో భాగంగా కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కె.శ్రీదేవి వెళ్తున్న తరుణంలో టిడిపి అల్లరిమూకలు ఆమె పైకి దాడికి దిగి ఎంపిపి కారు అద్దాలు ధ్వసం చేయడం చేశారన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ అరాచకాలు పెట్రేగి పోతున్నాయని, ఇలాంటి అరాచకాలు ఇలాగే కొనసాగుతూనే ఉంటే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెప్పే పరిస్థితి వస్తుందని తెలిపారు

జెసి ఒప్పందంతో కార్మికులకు అన్యాయం

- ఒప్పంద పత్రాలు దగ్ధం చేసిన కార్మికులు, యుఇఇయు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ యాజమాన్యంతో జేఏసీ చేసుకున్న ఒప్పందం వల్ల విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేస్తుందని తెలుపుతూ ఒప్పంద పత్రాలను ఎమ్మిగనూరు డివిజన్ కార్యాలయం ముందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్) దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్, ఎమ్మిగనూరు డివిజన్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఏళ్ల తరబడి డైరెక్ట్ పేమెంట్ రెగ్యులరైజేషన్ విషయాన్ని ఒప్పందంలో తేల్చకుండా జేఏసీ యాజమాన్యంతో లోపాయికారిప్పందాన్ని కుదుర్చుకున్నదని తీవ్రంగా దుయ్యబట్టారు ఈ ఒప్పందం వల్ల విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. గత రెండు దశాబ్దాలుగా కాంట్రాక్టు విద్యుత్ కార్మికులు పనిచేస్తున్న వారికి న్యాయం జరగాలంటే డైరెక్ట్ పేమెంట్ రెగ్యులరైజేషన్ ఒప్పందంలో చేర్చుకొని దానిని సాధిస్తేనే కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలియజేశారు. కాంట్రాక్టు విద్యుత్తు ఉద్యోగ కార్మికుల సమస్యలపై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు సమస్యలపై ఏళ్ల తరబడి పోరాటం చేస్తూనే ఉందని తెలిపారు. ఈ ఒప్పందాలపై యాజమాన్యం దిగిరాకపోతే సమ్మెకు వెళ్లాలని నిర్ణయం చేసిందని తెలిపారు. అయితే యాజమాన్యంతో మోసకారిఒప్పందానికి జేఏసీ ఒడిగట్టడం కాంట్రాక్టు కార్మికులకు తీవ్రని ద్రోహం తలపెట్టిందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకపోతే రాబోవు కాలంలో కాంట్రాక్ట్ కార్మికులందరినీ రాష్ట్రవ్యాప్తంగా సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు పి. గోవిందు, బి. రాముడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (యూనియన్ కాంట్రాక్ట్ వర్కర్స్) నాయకులు నాగన్న, యూనుస్ భాష, పోతప్ప, దేవేంద్ర రెడ్డి, సలీం భాష పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలను దగ్ధం చేస్తున్న కారిక్మకులు, యుఇఇయు నాయకులు

వికలాంగ ఉద్యోగులకు సర్వేకు మినహాయింపు

ప్రజాశక్తి-ఆదోని

ఇంటింటా సర్వేలు నిర్వహణపై గ్రామ వార్డు సచివాలయం వికలాంగ ఉద్యోగులకు మినహాఇంపు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షిణీయమని ఉద్యోగ సంఘం నాయకుడు వికలాంగ ఉద్యోగి అమరేష్ తెలిపారు. శనివారం ఆయన ఆదోనిలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి నిర్వహించే ఇంటింటా సర్వేలు వల్ల దివ్యంగా ఉద్యోగులు ఇబ్బందులు పడే వారమని తెలిపారు. ఎన్నోసార్లు ప్రభుత్వానికి తమకు మినహాయింపు ఇవ్వాలని అసోసియేషన్ తరపున విన్నవించుకున్నామన్నారు. పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయల వికలాంగ ఉద్యోగులకు ఫీల్డ్ విధులు, సర్వేల నుండి పూర్తిగా మినహాయింపు ఇచ్చే విధంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు,శాఖాధిపతులకు ప్రభుత్వం శుక్రవారం సర్కులర్ జారీ చేసిందన్నారు. ప్రభుత్వానికి, గ్రామ వార్డు సచివాలయ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఐఎఎస్‌కు గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్ధకు , వికలాంగుల ఉద్యోగుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-కోసిగి

గ్రామంలోని రైల్వేగేట్ నుండి ఉరుకుందకు వెళ్లే దారిలో చాప వంక పక్కన ఉన్న విశ్వబ్రాహ్మణుల కులఆరాధ్య దైవం శ్రీ పోతులూరి వీరబ్రహ్మం మఠం ప్రాంగణంలో మంత్రాలయం వైసిపి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులతో తాగునీటి బోరు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైసిపి జిల్లా కార్యదర్శి పి.మురళీమోహన్ రెడ్డి , ఎంపిపి పెండేకల్లు ఈరన్న , నాడిగేని నాగరాజుల ఆధ్వర్యంలో బ్రహ్మంగారి మఠంలో పూజలు చేసి తాగునీటి బోరుకు పూజ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన బోరులో మూడించుల నీరు పడినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువా పూలమాలతో సత్కరించారు. రాబోయే రోజుల్లో ఆలయానికి ఆర్థిక సహాయం చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని వైసిపి నాయకులు తెలిపారు. వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

సంతకాలు చేశారు.. వెళ్లారు..!

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాల్సిన ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి సుంకర ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. అయితే.. ఎంపిటిసిలు, సర్పంచులు సమావేశపు బుక్కులో సంతకాలు చేసి వెళ్లిపోవడం చూస్తుంటే సమావేశాలు అంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమౌతుంది. ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ.. ఆర్అండ్‌బి రోడ్ల దుస్థితి చాలా దారుణంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులు మాత్రం సర్వసభ్య సమావేశానికి గైర్హాజరవ్వడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. గతంలో గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారం కాకపోవడంతో సభ నుండి ఎంపిటిసిలు వెళ్లిపోయినట్లు సమాచారం. ఎంపిడిఒ గీతావాణి, ఇఒఆర్‌డి విజయభాను, ఎంఇఒ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, పిఆర్ఎఇ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ హనుమంతు, ఎపిఎం జనార్ధన్, ఎపిఒ రామకృష్ణ, పంచాయతీ, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్‌గా టి. అజయ్ కుమార్

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని ఇంచార్జ్ సబ్ కలెక్టర్‌గా అజయ్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్-4లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తోట అజయ్ కుమార్‌కు ఇన్చార్జి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలను అప్పగించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మౌర్యభరద్వాజ్ సత్యసాయిజిల్లాకు జాయింట్ కలెక్టర్ గా పదోన్నతితో బదిలీ అయ్యారు. రెవిన్యూ,మున్సిపల్, మండల పరిషత్ అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పై దాడి హేయమైచర్య

- ప్రజాస్వామ్య దేశంలో ఆటవిక చేష్టలు తగదు
- దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పత్తికొండ

పత్తికొండ మాజీ మహిళా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పై కూటమి రౌడీమూకలు దాడి చేయడం హేయమైన చర్య అని ఎంపిపి నారాయణదాసు, వైసిపి బీసీ జిల్లా కార్యదర్శి సోమశేఖర్, బాబుల్ రెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ శ్రీరంగడు, మండల కన్వీనర్ నాగరాజు యాదవ్, లీగల్ సెల్ ప్రతినిధి నరసింహచార్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పత్తికొండ పట్టణంలోని స్థానిక వైసిపి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్వగృహంలో మండల కన్వీనర్ కారం నాగరాజు యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక మహిళ, మాజీ ఎమ్మెల్యే అని చూడకుండా ఆటవికంగా దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా క్రిష్ణగిరి మండలం చిట్యాల గ్రామ సమీపంలో వెళ్తుండగా కూటమి నాయకులు కార్యకర్తలు మాజీ మహిళ ఎమ్మెల్యే అని చూడకుండా అడ్డుకొని దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. గతంలో బాబు ష్యూరిటీ జాబ్ గ్యారంటీ తదితర కార్యక్రమాలు టిడిపి నాయకులు చేపట్టారని అయితే అప్పుడు వారిని అడ్డగించలేదన్నారు. అలా అడ్డగించి ఉంటే ప్రస్తుతం అధికారంలో ఉండేవారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వ్యక్తిగత కక్షలు అక్రమ కేసులు మానుకొని ప్రజా సంక్షేమం ప్రజా సేవ కొరకు అధికార పక్షం ప్రతిపక్షం అని చూడకుండా ముందుకు సాగుదామని హితవు పలికారు. దాడికి పాల్పడిన కూటమి రౌడీ మూకలను, అల్లరి గ్యాంగులను గుర్తించి పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అలా లేని పక్షంలో వైసిపి ఆధ్వర్యంలో న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, వైస్ ఎంపిపి బలరాముడు, హోసూరు బనగాని శ్రీనివాసులు, ముస్లిం మైనారిటీ నాయకులు శాబ్దిన్ నూర్ బాషా, గుండు జిలాన్‌బాష, నాయకులుకార్యకర్తలు పెద్దహుల్తి నాగరాజు, కోతిరాల్ల సర్పంచి ఆంజనేయ, కోతి రాళ్ల కృష్ణారెడ్డి, పులికొండ తిప్పయ్య, పుచ్చకాయలమాడ మోహన్, కోల్కరు హుస్సేన్ సాహెబ్, మాజీ శారీ కన్నా చైర్మన్ హనీఫ్, దూదేకుండా రంగన్న, గుండు మహమ్మద్ పాల్గొన్నారు.

పత్తికొండ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నారాయణదాసు, తదితరులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

ప్రజాశక్తి-చిప్పగిరి

మండలంలోని ఏ గ్రామంలో అయినా సరే ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేయబోమని ఎస్ఐ ఎపి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం చిప్పగిరి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో పేకాటకు, బెల్ట్ షాపులకు, మట్కా, అక్రమ కర్ణాటక మద్యంకు తావు లేదన్నారు. ఒకవేళ ఎవరైనా అతిక్రమిస్తే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించమన్నారు. మండలం ప్రశాంతంగా ఉండుటకు నా సాయశక్తులా కృషి చేస్తానన్నారు. మండలంలో దీపావళి సందర్భంగా అనుమతి లేని బాణసంచాలు విక్రయించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఖాదర్ వలీ, షబ్బీర్, శంకర్ పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ , వాహనాల ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. పోలీస్ రామోజీ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఎస్ఐ శ్రీని వాసులు , కానిస్టేబుల్ రామోజీ

లెదర్ సొసైటీ అక్రమాలపై ఉపేక్షించేది లేదు

ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

లెదర్ సొసైటీ అక్రమాలపై ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలుగొట్ల రోడ్డులోని లెదర్ సొసైటీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పద్మశ్రీ మాచాని సోమప్ప ఏర్పాటు చేసిన లెదర్ సొసైటీని అన్యాక్రాంతం కాకుండా అందులో జరుగుతున్న దోపిడిని అరికట్టి పూర్వ వైభవం తీసుకొస్తామని అన్నారు. సొసైటీ సభ్యులు సమస్యలు విని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. లక్షల కోట్ల విలువైన సామాగ్రిని తరలించే ప్రయత్నం జరుగుతుందని ప్యూర్‌లెదర్‌ను తయారు చేస్తున్న షేర్ హోల్డర్స్ దళిత సామాజిక వర్గానికి చెందిన వారి కష్టాన్ని వారికే చెందకుండా ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పనిచేయడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని ఆయన తెలిపారు. సొసైటీలో సభ్యులు కాకుండా బతికున్న వారిని చచ్చినట్టుగా చచ్చిన వారిని బ్రతికున్నట్టుగా చిత్రీకరించి.సొసైటీ కి సంబంధం లేని వారిని సొసైటీలో చేర్చి..సొసైటీ లేదంటూ ప్రచారం చేస్తూ మాయాజాలం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణపార్టీ అధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో ముందస్తు దీపావళి

ప్రజాశక్తి - ఆదోని

సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు నిర్వహించడం ఆనవాయితుగా వస్తుందని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏజీఎం రమేష్ తెలిపారు. ఆదోని నారాయణ స్కూల్లో ప్రిన్సిపల్ లక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తుగా శనివారం దీపావళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్దశిని దీన్ని నరక చతుర్దశి గ కూడా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - ఆదోని

పరిశుభ్రత తోనే రోగాలు దరి చేరకుండా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. శనివారం స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుండి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ ఆదోనిగా మారుద్దామని ప్రజలు సహకరించాలన్నారు. మున్సిపల్ హై స్కూల్ సమీపంలో మొక్కలు నాటారు. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.ప్లాస్టిక్ వాడకం నిషేధమని, డస్ట్ బిన్నులు వాడాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్, మేప్మా సిఎంఎం వీరారెడ్డి, ఆర్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండలో శనివారం పర్యావరణంపై డిప్యూటీ ఎంపిడిఒ ఆధ్వర్యంల సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సైకిల్ ర్యాలీలో మాజీ ఎంపీపీ కప్పట్రాళ్ల రామచంద్ర నాయుడు, మాజీ జెడ్పిటిసి ఉచిరప్ప, టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్‌గౌడ్, మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ అల్లారుదిన్నె మల్లయ్య, టిడిపి నాయకులు పల్లెదొడ్డి రాజశేఖర్‌గౌడ్, రాజగోపాల్‌గౌడ్ మండల కూటమి నాయకులుఉచీరప్ప, రామాంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.